# కర్ణాట సంగీతం

అంగర వెంకట కృష్ణారావు

చాలా కాలంనుండీ యెందరో వ్యక్తులూ, సంఘాలూ కష్టపడిన మీదట, అమరజీవి పొట్టి శ్రీరాములుగారు తమ నిండు ప్రాణాలను బలి పెట్టినమీదట, ఆంధ్రరాష్ట్రం మనకు లభించింది. వెను వెంటనే మన తెలుగుదేశాన్ని అన్నివిధాలా ముందుకు సాగిపోయి, సాటిదేశాలకు తీసిపోని తరగతికి తీసుకురావడం తెలుగువాళ్ల విధి. రాజకీయంగా, ఆర్థికంగా, సాంస్కృతికంగా, కళాపరంగా, యింకా అన్నివిధాలా ఒకనాడు మనకు వుండివున్నది అని చెప్పుకొని తిరిగే ఆ పెద్దతనం తిరిగి సంపాదించాలి.

ఈ కోర్కెని మనసులో పెట్టుకుని మనం పనిచెయ్యబోతున్నప్పుడు, దేశంయొక్క బాగునకు మనం యేం చెయ్యాలి అని ముందుగా ఆలోచించుకోవాలి. అంతకంటె ముందు మనకున్న సమస్యల్ని నిజస్వరూపంలో ముందుపెట్టుకుని, అనవసరమైన అభిమానాలకు, కిట్టని తనాలకు లోబడకుండా, వాటిని అర్థంచేసుకుని, తర్కించి ఆ సమస్యలకు ప్రశ్నలకు సమాధానాలు సంపాదించి, వాటిమీద మనం అనుసరించబోయే నిర్మాణ కార్యక్రమాన్ని ఆధారపరిచితేనే, అనుకున్న పని జరుగుతుంది.

ఇప్పుడు మన కర్ణాటపద్ధతి గాయకులూ, యీ పద్ధతినీ గూర్చి కొంచెం చర్చించబోతున్నాను. నేను స్వయంగా పాడలేను. శాస్త్రంమీద అభిమానం, భక్తికలవాడనే. సంగీతం ఒకకళ. అంతే కాదు "సంగీతమపి సాహిత్యమ్ " అని సంగీతాన్ని ముందుగా పేర్కొన్నారు పెద్దలు. "శిశుర్వేత్తి పశుర్వేత్తి, వేత్తిగాన రసంఫణిః..." ఈ కళలో అంత ప్రసాదగుణం కలదని భావం. చిన్నపిల్లలకు సైతం అర్థం అయే యీ కళ గూర్చి, శాస్త్రంతో యెక్కువగా పరిచయం లేనప్పటికీ నేను వ్రాయడంలో అంత ప్రమాదంలేదని, దీనిని గురించి సత్యమైన నా అభిప్రాయాన్ని వెలిబుచ్చడమే ముఖ్యంగా వ్రాస్తున్నా.

"మద్భక్తాయత్ర గాయన్తి తత్రతిష్ఠామినారద" అన్నాట్ట భగవంతుడు. అంటే భగవంతుడు సంగీతం ఒకదగ్గరే వుంటారని అభిప్రాయం. "నాదబ్రహ్మం" అన్నారు పెద్దలు. సృష్టికి ఆది అయిన "ఓం" కారంకూడా ఒక శబ్దమే. ప్రకృతిలో ఎల్ల చోటులా, భగవంతుడు నిండివున్నట్టు, ప్రకృతి అంతటా యీ సంగీతం వున్నదనడం అతర్కం కాదు. ప్రకృతిప్రభావంవల్ల మానవ హృదయంలో కలిగే అనుభూతి విశేషాన్ని శబ్దాత్మకమైన సంగీతంద్వారా వ్యక్తపరుస్తాడు మానవుడు.

ఇక మన కర్ణాట సంగీతంవద్దకు వద్దాం! "శాస్త్రయుక్తమైనది" అని చెప్పబడే కర్ణాట సంగీతం జనబాహుళ్యంయొక్క అభిమానాన్ని పూర్తిగా కోల్పోయింది అన్నది నిర్వివాదం. పాటకచేరీలకు యెక్కువమంది రారు. సాధారణంగా యివి పంచాయతీ కోర్టులు అవుతాయి. వచ్చేవాళ్ళలో నూటికి తొంభైమంది పాట ఆరంభించిన పది నిముషాలలోపునే వెడిపోతారు.

పేరుమోసిన గాయకులు పాడితే హాలు నిండుతుంది. చాలామంది వుండి వింటారు. అంతమాత్రాన యీ కర్ణాట సంగీతానికి ప్రజల ఆదరం వున్నది అనుకోవడం అనుమానంలేని పొరపాటు. రెండు లక్షల ప్రజలున్న వూళ్లో వందలమంది కచేరీవింటే అది ఆదరభావం అని యెలా నమ్మతాం? అందులో కొందరు పైవూళ్ళనుంచి కరుగెత్తుకొచ్చిన వాళ్లుంటారు కూడా. డబ్బులేక విననివాళ్ళు ఎందరో వుండరు. రిస్టువాచీ అమ్ముకొని సుబ్బులక్ష్మి పాట విన్న మనిషిని నే నెరుగుదును.

పోతే ఎందుచేత యీ కర్ణాట సంగీతం అనబడేది ప్రజల ఆదరాన్ని గోల్పోయింది? ఇది ప్రశ్న. నా మటుకు నాకు యీ రోజులలో కర్ణాటశాస్త్ర సమ్మత సంగీతం అని పాడుతున్న వాళ్ళని వింటూంటే తలనొప్పి, దుఃఖంవస్తాయి. అంతమాత్రాన ఆ శాస్త్రం అంటే నాకు కిట్టదని

యెంతమాత్రం కాదు. దానిమీద యెంతో భక్తి వుంది నాకు. అది గొప్ప పద్ధతి. ఏనాటి త్యాగరాజు! నేటికీ పూరూరా మ్రోగుతూంది అతని పద్ధతి. అయితే యీ లోపం యెక్కడవుంది? నాలోనా? అంటే ప్రజలలోనా అని. లేక పాడే వాళ్ళలోనా?

పేరుమోసిన కర్ణాట(పద్ధతి) గాయకులందరూ సంగీత శాస్త్రజ్ఞానంలో గట్టివాళ్ళు కావచ్చు. కాని వాళ్ళు గొంతెత్తితే ప్రజలు ఆకర్షింపబడరు. శాస్త్ర పరిచయంగల కొద్దిమంది, యింకా మరి కొద్దిమంది మాత్రమే పాటవిని, ఆనందించినట్టు 'ఫీల్' అవుతారు. 'ఇంకా మరి కొద్దిమంది' అన్నవారెవరో ఆలోచిద్దాం.

ఏ కళారచన అయినా అందరికీ సులభంగా, వారివారి తరహాలలో బోధపడాలి. అలా బోధపడితేనే ఆ కళారచన జాతి అయినది. సాధన మీద అలవాటయేదల్లా మంచిది కాలేదు. కల్లు త్రాగడానికి అలవడడం సులభం కాదు, ఆ అలవాటు మంచిదీ కాదు. కాని ప్రయత్నించగా, ప్రయత్నించగా అలవడుతుంది, తత్కాలిక ఆనందము యిస్తుంది. అయితేయీపని మంచిదా? ఇది "ది ఆర్" అనే తన పుస్తకంలో టాల్‌స్టాయ్ ప్రవచనం! పెద్దలు కవిత్వంలో ప్రసాదగుణం యొక్క ప్రాధాన్యాన్ని యెంతైనా నొక్కి చెప్పారు. ఇది సంగీతానికి కూడా వర్తిస్తుంది.

నేటి పేరుబడ్డ కర్ణాటపద్ధతి గాయకులను మెచ్చుకునే 'మరికొద్దిమంది' వాళ్ళగానం అనే ఆముదానికి అలవాటు పడిపోయి దానిని అమృతంలా తాగుతున్నారు.

నేడు దక్షిణాదిని కర్ణాట సంగీతం అని పిలవబడుతూ, త్యాగరాజు, ముత్తుస్వామి దీక్షితర్ మొదలైనవారి రచనల మీదుగా చలామణీ అవుతూన్న సంగీతం, కనుబొమలమీద వెంట్రుకలలా ఎదుగూ బొదుగూ లేకుండా యెక్కడదక్కడే వున్నది. ఎవరు పాడినా ఆ రాగాన్ని అలాగే, అంతా పాడతారు. కాకపోతే కొందరు సాగదీసి తిరిగి తిరిగి అవే కళలు వేస్తారు. ఇందులో మరో విశేషం. సంగీతం నేర్చుకుటూన్న పదేళ్ళఅమ్మాయినిగాని అబ్బాయినిగానిఒకపాట పాడమంటే, ఒక చిన్న ఆలాపనచేసి, పల్లవి అనుపల్లవి పాడి, స్వరంకట్టి మరీ ముగిస్తారు. దానమ్మకడుపు బంగారంగానూ, స్వరంలేకపోతే యేంపోయింది! ఇది అంతా సంగీతంయొక్క తద్దిన-తంతుట. ఇవన్నీ లేకపోయినా, అందులో ఏదిలేకపోయినా పాడిన వాడి సత్తాకి దెబ్బ!

ఇక యితర సంగీతాల విషయం కొంచెం ప్రస్తావించడం అవసరం. కరాచీ, ఢిల్లీ మొదలైన ఉత్తరాది రేడియో కేంద్రాలద్వారా ప్రసారితం అవుతూన్న సంగీతం, జీవించినమనిషిలా అప్పుడిలా ఆత్మప్రబోధంలా వుంటుంది. తలత్ మహమ్మద్, రఫీ మొదలైన సినీగాయకులపాటలు హాయిగా అర్థవంతంగా రసవంతంగా వుంటాయి. ఇటీవల ప్రేమలేఖలు చిత్రం చూసిన తరవాత నాకు 'హమ్మయ్య' అనిపించింది. వినికిడి వున్నంత వరకూ, కనీసం వెండితెరమీద విన్నంతవరకూ, దక్షిణాదిని జిక్కి గొంతుక అద్వితీయం.

సినీమా సంగీతం విషయమై యీ మధ్య కొంత దుమారం రేగింది. రేడియో, రికార్డుద్వారా ప్రచారం పొందుతూన్న యీ సంగీతం చౌకబారు దని, ఇంకా మరకు యిప్పుడు అవసరంలేని మరి కొన్ని నిందలువేసి ప్రభుత్వం దీనిప్రసారం పాలు తగ్గించింది. దీని పర్యవసానం యేమిటి? దేశం అంతా 'రేడియో సిలోన్' మీదపడింది. అయితే ఈ ప్రజాసాగరం అంతా సత్యాన్ని మరిచిపోయి మోసపోతూన్నదనడం సాహసం.

"బైజుబావరా" "తీన్ బత్తీ చార్ రాస్తా" "మహల్" మొదలైన యిటీవలి చిత్రాలలో, "తాన్‌సేన్" వరకూవచ్చిన వేరేక సంగీతచిత్రాలలో వున్నది ఏ సంగీతం? అది చవకబారు సంగీతమా? అది ప్రజలను ఉర్రూతలూగించినదే! మన హృదయాల్లో రసతరంగాలు రేకెత్తించిన "బరసాత్" అన్న తానీపాటు, "దియాజలావ్"అన్న తాన్‌సేన్ పాట, మహల్ చిత్రంలో "ఆయగా"అన్న పాట, బైజుబావరాలో "ఓ దునియాకేరఖవాలే" అన్నపాట మనం యెప్పటికైనా మరువగలమా? అది చౌకబారుసంగీతం అనగలిగిన నేటి దక్షిణాది శాస్త్రీయ గాయకులనబడేవారెవరైనా అలా పాడి చూపండి! జోహార్ చేసి మతం మార్చుకొంటాను!

అయితే యీ శాస్త్రీయసంగీతం అనబడేది, నేటిదక్షిణాదిగాయకులు పాడుతూన్నది, ఎందుకు

ప్రజల అభిమానాన్ని గోల్పోయింది? అదీ ప్రశ్న - నేను పాశ్చాత్యసంగీతాన్ని, మధ్యప్రాచ్య సంగీతాన్ని ప్రత్యక్షంగా, రేడియోద్వారా, రికార్డుల ద్వారా విన్నాను. అవన్నీ నా హృదయాన్ని కదిల్చేయి. కాని నేను పాడబడుతూన్న కర్ణాట సంగీతం నీరసంగా, పాతగా, నాజూకులేక, అసహ్యాకరంగా వుంటుంది. ఈ విషయాన్ని నేను చాలా తర్కించుకున్నాను.

నాకు తోచినదేమంటే 'శాస్త్రం' అన్న నిషాలో పడిపోయి, గాయకులు సంగీతానికి కావలసిన ముఖ్య విషయాన్ని మరిచిపోయారు. ఆదే 'తీయని కంఠం' అబ్దుల్ కరీంఖాన్ మొదలు, మొహమ్మద్ రఫీవరకూ, ఓంకార్‌నాథ్ మొదలు, సైగల్ వరకూ, 'హీరాబాయ్ బరోడకార్' మొదలు 'బోరాబాయ్ అంబాలా' వరకూ నేటి 'లతామంగేష్కార్,' 'జిక్కీల' గొంతులలో వున్నది హాయి. అది దక్షిణాదిని తెలిసినంత వరకూ యితరులలో లేదు. ఈ కర్ణాట గాయకులెవ్వరూ 'Voice Culture'ను గుర్తులో పెట్టుకున్నట్టు లేదు.

ఆడేవారికి అంగసౌష్టవం ఎంతవసరమో పాడేవారికి శారీర సౌష్టవం అంత ముఖ్యం. ఒక్కొక్కప్పుడు వీధిలో వంకాయ లమ్ముకునే పల్లెపడుచు అమ్ముకునే పద్ధతిలో ఎంతో మాధుర్యం వుంటుంది: మా వూళ్లో పట్లు తోముకునే పుడకలు అమ్మే కుఱ్ఱవాడొక డున్నాడు. వాడు రోజూ వుదయాన్నే అమ్ముకొంటూ వెళుతూ ఒక కేక పెడతాడు. ఆ కేకకు అర్థం 'పల్తోం బుడకలోయ్' కాని యీ కేక గుండెల్ని ఛేదించుకు పోతుంది. నిర్జనారణ్యంలో,కొండలోయలో హటాత్తుగా ఒక నెమిలి పెట్టే కేకను అచ్చంగా పోలివుంటుంది ఆ అరుపు. వాడలాంటి స్థలంలోనే పుడకలు సేకరిస్తాడు. వాడి సంగీతగురువు నెమిలి!

అంచేత నేడు పలుకుబడిగా పాడుతూన్న వాళ్ళలో నూటికి తొంభైతొమ్మండుగురు సంగీతోపాసనకు తగరు. వాళ్ళకు "వాయిస్"లేదు. వాళ్లు శారీరకృషి చెయ్యలేదు.

కనుక యింతటునైనా మన సంగీతంలోమార్పు రావడం అత్యవసరం. గొంతు యింపుగాలేని వారు, శారీరకృషి చెయ్యనివారు, రేడియోలలోను, కచ్చేరీలలోను, పాడకండి. సముద్రంవలె లోతుగా, పర్వతంవలె సమున్నతంగా, విద్యుత్తువలె తీవ్రంగా హృదయాన్ని కరగించి మరగించగలిగే, ఆకాశయానం చేయించగలిగే, నిద్రపుచ్చగలిగే, వాంఛల తీవలకొసలకు ఆనందకుసుమాలను వికసితంచేయగలిగిన కంఠమాధుర్యాన్ని కలిగిన వారే పాడండి. తలిదండ్రులు తమబిడ్డలకు గాత్ర సంగీతం చెప్పించేముందు యీ విషయాన్ని బాగా ఆలోచించాలి.

"రహిబుట్ట జంత్రగాత్రముల రాల్గరగించు"నది గంధర్వవిద్య. ఒక పాశ్చాత్యవిద్వాంసుడేమన్నాడంటే—

First of all, never forget that in making music of any kind, the chief aim should be to cultivate a beautiful sound. No amount of florid achievement can be effective, unless it is accompanied by a pleasing tone. ....'

---

హిమాలయాలు చాలా ఉన్నతమైనవేగాని కొన్ని విషయాలను వాటిలో పోల్చడం తప్పు. హిమాలయమంత అభిమానంగాని ప్రేమగాని ధనంగాని, ఎప్పుడూ మంచుకిమల్లే కరిగి, నీళ్లు కారిపోతాయి!

* * * *

హానిచెయ్యని కొయ్య కంచు విగ్రహాలకి జాతరలు చెయ్యడం అనాగరికత. తమ కొంపలుముంచే నాయకులను జయజయధ్వానాలతో ఊరేగించడం నాగరికత.—షా

పాటపాడి హడలెత్తించే

# మన సంగీత విద్వాంసుల కొక విన్నపం

## ఒక రాష్ట్రేతరాంధ్రుని ఆవేదన

మార్చి 12వ తేదీ "తెలుగు స్వతంత్ర"లో శ్రీ అంగర వెంకటకృష్ణారావుగారు మన కర్ణాటకసంగీతంగూర్చి ఒకవ్యాసం వ్రాసేరు. అందులో ప్రస్తుత కర్ణాటకగాయకులను తీవ్రంగా విమర్శించేరు. ఆయనవ్రాసిన విషయాలను ప్రతీ కర్ణాటక సంగీతాభిమానీ శ్రద్ధగా ఆలోచించవలసిన అవుసరం ఎంతయినా వుంది.

"కర్ణాట శాస్త్రసమ్మత సంగీతం అని పాడుతున్న వాళ్ళని వింటూంటే తలనొప్పి దుఃఖం వస్తాయి" అన్నారు కృష్ణారావుగారు. ఇటీవల నేను విన్న కొన్ని కర్ణాటక పాటకచేరీలను జ్ఞాపకం తెచ్చుకుంటే ఆయనమాటలు సత్యదూరం కావేమో అనిపించింది. "కరాచీ, ఢిల్లీ మొదలైన ఉత్తరాది రేడియోకేంద్రాలద్వారా ప్రసారితమవుతున్న సంగీతం, జీవించిన మనిషిలా, ఆప్తుడిలా ఆత్మప్రబోధం" కలిగిస్తూంటే, త్యాగరాజు మొదలయిన మహామహులు మన కందించిన కర్ణాటక సంగీతం "జనబాహుళ్యంయొక్క అభిమానాన్ని" ఎందుచేత కోల్పోయిందో జాగ్రత్తగా ఆలోచించవలసిన విషయము.

ఆంధ్రదేశంలోని సంగీతాభిమానుల ఆదరాన్నే కోల్పోయినప్పుడు మన గాయకులు, జంత్రవిద్వాంసులు, కటకంలాటి రాష్ట్రేతర ప్రాంతంలో అపహాస్యానికి పాలవుతున్నారంటే ఆశ్చర్యంలేదు. ఆలిండియా రేడియోవారు ప్రారంభించిన నేషనల్ ప్రోగ్రామ్స్‌వల్ల ఉత్తర దక్షిణహిందుస్థానాల్లోని ప్రముఖ సంగీత విద్వాంసుల్ని వినడానికి అవకాశం చిక్కడమేకాక మన దక్షిణాదిసంగీతం మీద ఇక్కడివారికున్న హేళనభావం తెలుసుకుందికి కూడా నాలాటివారికి అవకాశం లభించింది. అప్పుడప్పుడు ఇక్కడ కటక్ రేడియో స్టేషన్‌లో "ఓపెన్ ఎయిర్ ప్రోగ్రామ్స్" అంటూ పెట్టిఉత్తరదక్షిణవిద్వాంసుల్ని రప్పిస్తూండడంవల్ల నాబోటి సంగీతప్రియులకి ఆ రెండురకాల సంగీతఫణితుల్ని ప్రత్యక్షంగా ఆస్వాదించేభాగ్యం, ఆకచేరీలు శ్రోతలలోకల్గించేభావం పూర్తిగా తెలుసుకుందుకి, అవకాశం కలిగింది. కొమ్ములు తిరిగిన దక్షిణాది విద్వాంసులువచ్చినా ఇక్కడి ఆంధ్రేతర సంగీతప్రియుల్ని ఏమాత్రం రంజింపచెయ్యలేక పోయారన్న విషయం మొదట నాకు కొంత ఆశ్చర్యాన్ని కలిగించినా, తర్వాత ఆలోచిస్తే సంప్రదాయాలు భిన్నమవడంవల్ల ఔత్తరాహులు దక్షిణాది సంగీతాన్నిగాని, దాక్షిణాత్యులు హిందుస్తానీ (శాస్త్రీయ) సంగీతాన్నిగాని ఆనందించలేకపోవడం కొంత సహజమేకదా అనిపించింది.

### ఈ అశక్తికి కారణం ఏమిటి?

కాని మొన్న మద్రాసులో జరిగిన బడే గులామాలీఖాన్‌గారి కచేరీగురించి శ్రీవాత్సవగారు మార్చి 19వ తేదీ "తెలుగు స్వతంత్ర"లో వ్రాసిన విషయాలు చదివిన తరువాత సంగీత రసాస్వాదానికి ఉత్తర దక్షిణపు సరిహద్దులు ఏమీ అటంకం కావన్న సత్యం తెలిసింది. అయితే బడేగులామాలీఖాన్ వంటి ఔత్తరాహులు దక్షిణాది ప్రజలను తమ గానంచేత ఉర్రూతలూగించినప్పుడు మన గాయకులెవ్వరూ ఈ ప్రాంతాల వారిని రంజించెయ్యలేక పోవడానికి కారణం ఏమిటి? స్థాన ప్రభావమో ఏమిటోగాని కర్ణాటక సంగీతమంటే ఇదివరకల్లా చెవి కోసుకునే నాకు కూడా ఇక్కడకువచ్చిన మన విద్వాంసుల కచేరీలు వింటూంటే ఏమిటో వెలితిగానే కన్పించేవి. బడేగులామాలీఖాన్, దిగంబర్ విష్ణు పలూస్కర్, వినాయక్ పట్‌వర్ధన్ వంటి ఉత్తరాది గాయకుల పాటల్లోని కమ్మనిదనం మన కచేరీలలో కనిపించడంలేదు. ఇక్కడకు వచ్చిన మన మార్దంగికుల విద్యకూడా కంఠేమహరాజ్,

రావుబాబు

అనోఖీలాల్ శాంతాప్రసాద్ మొదలైన ఉత్తరాది వారి తబలావాయిద్యంముందు వెలవెలపోతున్నట్టే అనిపించింది. ఇందుకు కారణం-కిందటికి ఒకవిజయనగరం వాయులీన విద్వాంసులు సెలవిచ్చినట్టు- "ఆంధ్రదేశం పొలిమేర అక్షతల మన విద్య గ్రహింపగల్గిన రసజ్ఞుడేడీ?" అని హేళనగా మన గాయకులు తగినంత శ్రద్ధ చూపడం లేదో, లేక అంగరవారు సెలవిచ్చినట్టు నేటి మన విద్వాంసులకు "హాయిగా, నీరసంగా, నాజూకు లేక" పాడడంతప్ప వేరే చాతకాదో తెలీదు. ఉత్తరాది గాయకులు నాదానికి పుచ్చుకొన్న శ్రద్ధ మన వారిలో కనపడదు. ఉత్తరాదివారి కచేరిలలో వారు పాడుతున్న రాగాలను పేర్కొని వాటి ఉత్పత్తిని కొంచెం వివరించి వాటివల్ల కలిగే అనుభూతి శ్రోతలకు తెలియజెప్పి, ఆ అనుభూతి ప్రత్యక్షంగా కల్గిస్తారు. కర్ణాటక కచేరీలలో పాడుతున్నది ఏరాగమో దానివల్లకలిగే అనుభూతి ఏమిటో పాడుతున్నవారుగాని వింటున్నవారు గాని ఎప్పుడూ పట్టించుకున్నట్టు కనపడదు.

## భావానికి ప్రాధాన్యం ఎందుకివ్వరు?

మొన్న వినాయక్ పట్వర్ధన్ కచేరీ చేస్తూ "మేఘ మల్హారు" రాగం ప్రారంభించి, ఆ రాగోత్పత్తిని గురించి కొంత వివరించి, అది మేఘాల్ని, వర్షాన్ని చివర్న పిడుగులతో పాటు ఝంఝామారుతాన్ని స్ఫురింపచేస్తుంది, ఆ అనుభవం శ్రోతలకి కలగకపోతే తన కచేరీ నిష్ఫలం అని చెప్పి తన గానంతో అక్షరాలా ఆ అనుభూతిని కల్గించేడు. కచేరీ ఆఖరున "సింధుభైరవి"లో "జోగీ, మతు జా" అన్న పాట వింటుంటే కోపోద్రిక్తుడై పారిపోతున్న యోగీశ్వరుడు (తపోభంగమయిన శివుడు) ఎంత రాతి హృదయుడైనా గిరిజ ప్రార్థనకు కరిగి ఒక్క అడుగయినా ముందుకు వెయ్యలేక అలా తన్మయుడై నిలబడిపోక తప్పదు, అన్న భావం నాలాటి దాక్షిణాత్యుడికే కలిగిందంటే స్థానిక సంగీతప్రియులరసోన్మాదం వేరే చెప్పనక్కర్లేదు. మనవారు కూడా ఇలా భావప్రాధాన్యంగా గానంచెయ్యడం ఎందుచేత పూనుకోరు? సంగీతానికి మూలపురుషుడైన త్యాగరాజు భావానికి ఎక్కువ ప్రాధాన్యము యివ్వాలని ఘోషించేడే! "నను పాలింప" అన్న కీర్తన భావస్ఫూర్తిగా పాడితే భగవంతుడు నిజంగా నడచివస్తున్నట్లే కళ్ళకికడుతుందే! మన భాషని, భావాన్ని కూడా ఖూనీ చేసిన నేటి విద్వాంసులవల్లనే మన సంగీతం ప్రజాబాహుళ్యానికి దూరంగపోయింది.

## సభా మర్యాదలైనా తెలియని విద్వాంసులు

ఆంధ్రదేశంలోని పరిస్థితులెలావున్నా రాష్ట్రేతరాంధ్రప్రదేశాల్లో కచేరిలు చేస్తున్న మన విద్వాంసులయినా కొంత మెలకువగా ప్రవర్తించకపోతే రాజకీయంగానూ, ఇతరత్రానూ మన ఆంధ్రుల మీదవున్న ఏహ్యభావంతోపాటు మన సంగీతం గురించి, మన కళలగురించి ఇక్కడివారికి అనవసరమయిన దురభిప్రాయం ఏర్పడుతుంది. మొన్న నాలుగురోజులకిందట జరిగిన ఒకవిషయం ముచ్చటిస్తాను. కిందటి నెల 30వ తారీఖున కటక్ రేడియో వారు ఓపెన్ ఎయిర్ కాన్సర్ట్ ప్రోగ్రామ్ పెట్టి ఢిల్లీ, అలహాబాదు, కలకత్తా, కాశీ విద్వాంసులతో పాటు విజయవాడనుండి ఒక వైణికుణ్ణికూడా ఆహ్వానించేరు. అతనితోపాటు విజయనగరం నుండి కొమ్ములుతిరిగిన మార్దంగికాగ్రేసరుడు కూడా రావడంవల్ల కర్ణాటక సంగీతాభిమానులనేకులు సభకు విచ్చేశారు. మంత్రులు, ఉపమంత్రులు మిగతా పురప్రముఖులతో సభ నిండివుంది. అప్పుడే ఉస్తాద్ రహీముద్దీన్ డాగర్ ప్రశాంతమయిన భక్తిగీతాన్ని పాడి సభికులను ముగ్ధుల్ని చేసి కరతాళధ్వనులమధ్య వేదిక దిగేడు. మన వైణికులు మార్దంగికులు వేదికనలంకరించేరు. ప్రారంభములో కాని అంత్యంలో కాని సభికులకు నమస్కారంచేసే మర్యాదను వైణికులు పాటించకపోవడం అంత పెద్ద విషయం కాకపోయినా వేదికమీద అసభ్యంగా వక్కపొడో ఏదో నములుతూ—ఒకపక్క రేడియో ప్రసారం జరుగుతుండగా!—మధ్యమధ్య తుప్పుతుప్పుమని ఉమ్ముతూ తనయింట్లో ఏదో ఉబుసుపోకకు వాయించిన మాదిరి రేడియో ప్రోగ్రాములో వాయించుకుని పోవడం ఆంధ్రులకి ఆంధ్రేతరులకి కూడా ఆశ్చర్యాన్ని, అసహ్యాన్ని కలిగించింది. దానికితోడు

యిచ్చిన ముప్ఫై నిముషాలలోనూ ఏదో ఒక్క రాగం ఎత్తుకొని దానిలోని కళలను చూపించడానికిమారు రాగమాలిక అని ఓ డజను రాగాల్ని ఒకదానివెనుకనొకటి పాఠం వప్పచెప్పినట్టు గబగబ వాయించుకో పోతూవుంటే శ్రోతలు ఆ విద్యాప్రదర్శనానికి తట్టుకోలేక ఉక్కిరిబిక్కిరి అయ్యారనే చెప్పాలి. మార్దంగికుల విద్యచేతనయినా సభికులు ఆకర్షింపబడతారేమో అంటే వారికి పాపం అవకాశమే లేకపోయింది. పైగా ఇద్దరికీ తాళం కుదరక సామరస్యంచెడి 'ఎవరికి వారే యమునాతీరే' లా వాయించుకోపోతూ అందరి అపహాస్యానికీ పాత్రులైనారు. వేదిక మీద జరుగుతున్న రసాభాస చూచి లోనుండి ఇచ్చటి రేడియో నిలయవిద్వాంసులైన మిశ్రో మహాశయులు (కొన్నాళ్ళు విజయనగరం సంగీత కళాశాలలో విద్య నభ్యసించినవారు) పరుగున వచ్చి వేదికనెక్కి వేళ్ళతో తాళంవేసి ఇద్దరునీ ఒక దారిలోకి తీసుకోరావలసి వచ్చింది ఖర్మం! ఒక కర్ణాటక కచేరీలో తాళం, లయ మృగ్యం అవడం, ఒక ఉత్కళసోదరుడు సహాయానికి వస్తేనేగాని మన వారికి దిక్కు లేకపోవడం మొదలయిన సంఘటనలవల్ల స్థానిక ప్రముఖుల దృష్టిలో మనం ఎంత అధోగతికి వెళ్లేమో చెప్పనవసరంలేదు. మరో విశేషం: ఇచ్చిన 30 నిముషాల గడువులోనూ ఇంకా అయిదారు నిముషాలు వున్నట్టు ఎదురుగానున్న .వాచీ చూపిస్తున్నా, ఓమూల మార్దంగికులు ప్రత్యేకంగా తమ విద్య ప్రదర్శించడానికి సన్నాహాలుచేసుకుంటూ వుండగానే, వైణికులు "ఇహ ముగించేద్దామా?" అన్నట్టు ప్రశ్నార్థకంగా పక్కనున్న ఎనౌన్సర్ వంకచూసి వీణ కింద పెట్టేయడం, రేడియో స్టేషనువారంతా లోలోన నవ్వుకోవడం, చివరకి ఒక్క కరతాళధ్వని ఐనా లేకుండా వైణికులు వేదికదిగడం– అంతా చూస్తుంటే అక్కడవున్న ఆంధ్రుల హృదయాలు ఎంత క్షోభించేయో చెప్పలేను. ఇటువంటి అవకతవక కచేరీలవల్ల ఆంధ్రుల మీద, ఆంధ్ర సంస్కృతిమీద, ఆంధ్రుల కళల మీదా ఔత్తరాహులకి ఎటువంటి నీచాభిప్రాయం కలుగుతుందో మన విద్వాంసులు ఆలోచించకపోవడం నిజంగా ఆశ్చర్యకరం!

ఇక్కడకువచ్చిన కొందరు కర్ణాటక విద్వాంసులలో మరో విశేషం కన్పించింది. కర్ణాటక సంగీతం అంటే ఏమిటో విందామని కుతూహలంతో వచ్చిన ఉత్కళ, వంగ, గుజరాతీ, మరాటీ శ్రోతలదగ్గర 16 అణాల కర్ణాటకరాగాలయిన (ధీర) శంకరాభరణం, (మేచ) కల్యాణి, (నఠ) భైరవి, మోహన, షణ్ముఖప్రియ, పంతువరాళి, సింహేంద్రమధ్యం మొదలయినవేవీ ఎత్తుకోకుండా–ఉత్తరాదివారిని అనందింప చేద్దామని కాబోలు ఏ భీంపలాసో, ఏ బేహాగో ఎత్తుకోవడం ఇక్కడి విద్వాంసులు పెదవి విరవడం చాలాసార్లు జరిగింది. ఈ ఉత్తర హిందుస్థానీ రాగాలను అఖండంగా పాడేవారు (కర్ణాటక విద్వాంసులు మన్నింతురుగాక!) ఇక్కడ వుండడమేకాక వారిఫణితులు మనఫణితులు వేరుఅవడంవల్లఆరాగాలుపాడి ఇక్కడివారినిరంజింపజెయ్యడం కష్టం. ఉదాహరణకి రష్యానుంచి ఎవరో యువతులువచ్చేరని వారి వేషభాషలెలావుంటాయో అని ఉత్సుకతతో మనవారంతా వెళ్ళేసరికి, మన వారిని రంజింపచెయ్యడానికని వారు ఏమద్రాసు గళ్ళచీరనో చుట్టబెట్టుకుంటే ఏమవుతుంది?ఆ కట్టులోని పొరబాట్లనిచూసిమనంనవ్వుకుంటామేగాని వారి దేశవేషభాషలగురించి మనకు తెలిసిందేమిటి?

కనుక మన కర్ణాటక విద్వాంసులందరికీ నమస్కారం చేసి నేచేసేవిన్నపం యిది: ఇహాముందు రాష్ట్రేతరప్రాంతానికివచ్చి కచేరీలు చేసినపుడు బేహాగులు, భీంపలాసులు మానేసి చక్కని కర్ణాటక రాగాలు గానంచేసి మన శాస్త్రానికున్న ప్రత్యేకతను నిలుపుకోండి. ప్రపంచ సంగీత సంప్రదాయాల్లో మన కర్ణాటక సంగీతం అత్యున్నత స్థానం వహిస్తోంది. ఏ ఇతర సంప్రదాయాన్నీ చూసి మనం సిగ్గుపడవలసిన అవుసరం ఎంతమాత్రం లేదు. త్యాగయ్య కీర్తనలు సరిఅయిన భావంతో స్ఫుటమయినపలుకుతో గానంచేస్తే ఎక్కడిప్రజలయినా మంత్రముగ్ధులై తీరతారని నా విశ్వాసం. గాయకుల అశ్రద్ధవల్ల శాస్త్రానికి మచ్చరాకుండా జాగ్రత్తపడడం గాయకుల విధి అయివుంది.

ఇక పక్కవాయిద్యాలగురించి ఒక్కమాట: పరిచయంలేని పక్కవాయిద్యాలను తెచ్చుకోవడం కష్టం. పక్కవాయిద్యాలవారుకూడా గాయ

కుడికి ఎంత విద్యవుందో బొత్తిగా తెలుసుకోకుండా పక్కవాయిద్యానికి వప్పుకోవడం వారి పేరు ప్రతిష్ఠలు పాడుచేసుకోవడమే అవుతుంది. ఉత్తరాదిని తబలాకీ పాటకీ చక్కని మేళవింపు వుంటుంది. పాటలోని ప్రతి పలుకు తబలా మీద పలికిస్తారు. ప్రతి చరణానికి చివరన (లెక్క ప్రకారం) తబలామీదపలికించిన ఆ ముక్తాయింపు ఎంతో ఇంపుగావుంటుంది. నిజానికి తబలా లయ ననుసరించే గాయకుడు పాడతాడు. (బేండు ననుసరించి మిలటరీవారు నడిచినట్టు) మన పద్ధతి అందుకు పూర్తిగా భిన్నం. నేవిన్నంతమటుకు మృదంగం వాయిద్యం విడిగా చరణ చరణానికి గాయకుడి తాళాన్ని అనుసరించడానికి ప్రయత్నిస్తూ, మధ్య మధ్యఆపేస్తూ మళ్ళీప్రారంభిస్తూ ఇలావుంటుంది. తబలా మాదిరి కీర్తన మొదలు పూర్తి అయ్యేదాకా లయతప్పకుండాChronometer beats లాగ గాయకుడి తాళానికి సహాయకారిగావుండే పద్ధతి మనలో కనిపించ లేదు. ఇలా పద్ధతులు భిన్నం అవడంతోపాటు గాయకుడికీ మృదంగానికి సామరస్యం ఏమాత్రం చెడినా ఔత్తగాహులముందు మనవారు వెక్కిరింతల పాలవుతారు — అవుతున్నారు కూడా!

రేడియోలు వచ్చినదగ్గర్నుంచీ ఉత్తర దక్షిణ సంప్రదాయాల సరిహద్దులు క్రమంగాపోయి మనదేశంలోని సంగీతం అంతా ఒక్కటేశాస్త్రం అన్న భావన బలపడుతున్న ఈ రోజుల్లో మన విద్వాంసులు మన సంగీతాన్ని "కనుబొమలమీద వెంట్రుకలలా ఎదుగుబొదుగు లేకుండా యెక్కడి దక్కడే వుంచడం" బదులు హిందుస్తానీ కచేరీల పద్ధతిని కొంచెం గమనించి అందులో వారికి కన్పించిన మంచిని తీసుకోవడం సమంజసంగా కన్పిస్తుంది. ఓంకార్‌నాథ్, పలూస్కర్, పట్వర్ధన్‌లవంటి పేరుపొందిన హిందుస్తానీ గాయకుల కచేరీలను పరీక్షగాచూసి వారిలాగ నాదానికీ భావానికీ, పక్కవాయిద్యాల మేళవింపుకీ తగిన ప్రాముఖ్యం యివ్వడం ప్రారంభిస్తే, అద్వితీయమైన మన కర్ణాటక సంగీతం ప్రజాబాహుళ్యానికి అంతదూరంగా ఉండకుండా కొంత సన్నిహితం అవుతుందేమో అని నా విశ్వాసం.

# సహారాలో వసంతం

వజ్రపాణి

సహారా మండు టెడారిలో
విహరించే ఒంటెల బిడారుకు
సహాయపడింది ప్రకృతి
సహారాలో వసంతం పూచింది

తుషారానికైనా నోచని
విషాదకర పులినస్థలిలో
ఖుషీగా అమృతం వర్షించింది
నిషా ప్రకృతిలో తాండవించింది

గులాబులు విరపూచినయ్
షరాబు వాసనలు వీచినయ్
మలయమారుత సుగంధ సంభరిత
మధురతరంగ తురంగాలు లేచినయ్!

సహారాలోని వసంత కాంతికి
మహామోదము చెందిన శాంతికి
దెబ్బతీయకు! గుబ్బటిల్లకు!
బెబ్బులిలా బొబ్బరించకు!

ఏడేడు లోకాల శోకాలకు
ఏడుపులకు గాడుపులకు
పీడలకూ పీడల విక్రీడలకూ
పీడా విరగడైపోయింది!

అమలిన వసంత ప్రశాంతనిశాంత
సుమధుర రజనీ సుషమాకాంతుల
ఉమరూసాకీ ఉదయించారు!
అమలగీతికల నాలపించారు!

ఇది నాలోని సహారాలో వసంతం
అదిగో! మధుర ద్రాక్షాలతాంతం

Source: Press Academy Website, Telugu Swatantra Patrika, Mar and Apr 1954

**Disclaimer:** This topic/article/write-up has been posted here to increase the availability of some rare, forgotten and precious material for appreciation by a wider audience and with no intention what so ever of copy right violation.

Request for removal of any copyrighted material, by the owner, will be promptly complied with.

Maganti Vamsi Mohan
http://www.maganti.org/